# పిల్లని కంటాను

ఆచార్య కొలకలూరి ఇనాక్



'నాకు భయం!'

'భయపడాల్సిందేమీ లేదు. డాక్టర్లు సమర్థులు. మన మేలు కోరేవాళ్లు. నిర్భయంగా వుండు.' శ్రీరాం ఆఫీసుకి వెళ్లిపోయాడు.

వైదేహికి మళ్లీ ఏడుపు. భర్త దగ్గరుంటే కొంత ఓదార్పు. వెళ్లిపోతే దుఃఖం.

'ఏం భయం లేదు.! అత్త ఉత్తమురాలు. సొంత తల్లిలాగా చూసుకొంటూ వచ్చింది. ఇవాళ భయంకరంగా వుంది. అత్తను గూర్చి అమ్మ అడిగింది.

'వనజ ఎలా వుంటుంది?'

'అమ్మలాగా'

అటువంటి దేవత ఇవాళ దెయ్యంలాగా కనపడ సాగింది.

మునుపు అత్త తల నిమిరితే హాయిగా వుండేది. ఇవాళ తాకితే పాము కాటేసినట్టుంది.

అత్త అగ్నిగుండం. తాను దగ్ధమవుతుంది.

'నీ మేలు కొరకే'' అంది వనజ

'నాకు భయం!'

మనందరి కోసం!

'నాకిష్టం లేదు!'

'నీ ఇష్టా ఇష్టాలతో మాకు సంబంధం లేదు'

వనజ నలుగురన్నలకు ఒక్కతే చెల్లెలు. ఆమె భర్త అయిదుగురు అక్కలకు ఒక్కడే తమ్ముడు.

అక్కలందరికీ ఆడపిల్లలే!

తనకు కూడా ముగ్గురాడపిల్లల తర్వాత ఒక్కగానొక్క కొడుకు శ్రీరాం

అతడిని ఇంటిపేరు నిలిపే వంశాంకురంగా ప్రేమగా పెంచారు. తాత ముత్తాతల ఆస్తికి ఒక్కడే వారసుడు. వల్లమాలినంత ఆస్తి. సంపాదన.

వైదేహిని వనజ తన కొడుక్కు కోరుకోవడంలో ఆంతర్యం ఉంది.

ఆమె తల్లిదండ్రులు జానకీ రామయ్యలు. తండ్రికి అన్నదమ్ములు ఐదుగురు. వాళ్లకు పాతిక మంది మగపిల్లలు. అంతమందికీ తానొక్కతే సోదరి.

ఈ వంశం చాలా బాగుంది. అందరూ మగపిల్లలే. అంతమందిలో ఒక్కతే ఆడపిల్ల. ఈ వంశంలో ఆడపిల్లలు పుట్టడం అరుదు. వైదేహి ఆడపిల్లల్ని కనదు. మగపిల్లల్నే కంటుందని వనజ విశ్వసించింది.

తన భర్త వంశంలో ఎక్కువమంది ఆడపిల్లలు పుట్టడం ఆనవాయితీ.

తనే శ్రీరాంని కని అత్త ఘనకార్యాన్ని సాధించింది.

శ్రీరాంకి ఎక్కువ మంది మగపిల్లలు పుట్టాలని... మగపిల్లలే పుట్టే వంశం కోసం వెతికింది వనజ.

వైదేహి నచ్చింది. కట్నం కానుకల కోసం గోల లేకుండా పెళ్లి జరిగింది.

అంతా బాగానే జరిగింది. ఆర్నెల్లు గడిచాయి. వైదేహి నెల తప్పింది. మరి మూడునెలలకి అయిదుగురు అనంతపురం డాక్టర్లు, నలుగురు హైదరాబాద్ డాక్టర్లు, ఒక అమెరికా డాక్టరు వైదేహిని పరీక్షించారు.

పదిమందీ ఒకే మాట చెప్పారు.

'వైదేహి కడుపులో ఆడపిల్ల పెరుగుతూ వుంది'

వనజ నెత్తిమీద రాయి మీద పడింది. గుండెల్లో బండ పడింది. గొంతులో వెలక్కాయ ఇరుక్కొంది.

'అందరూ ఆడపిల్లలే పుట్టే వంశంలో ఒకే ఒక్కడు శ్రీరాం వంశోద్ధారకుడు పుట్టాడు. అందరూ మగపిల్లలే పుట్టే వంశంలో వైదేహి ఒక్కతే అదృష్టవంతురాలు పుట్టింది. వాళ్లకు పెళ్లయితే అందరూ మగపిల్లలే పుడతారని ఆశపడ్డాను. ఇలా అవుతుందని అనుకోలేదు'. వనజ నిట్టూర్చింది. నిరాశపడింది. నిశ్చయానికి వచ్చింది. నిర్ణయం చెప్పింది.

'కడుపు తీయించాలి'

ఆరోజు సాయంకాలం జానకీ రామయ్యలు వచ్చారు. కూతుర్ని దీవించారు. ముద్దుమురిపాలు చూపారు.

అమ్మానాన్నలను చూసి వైదేహి పొంగిపోయింది. కౌగిలించుకొని ఏడ్చింది. రక్షిస్తారని వెర్రి దానిలా నవ్వింది. అమ్మ వొళ్లో వాలిపోయింది.

'నీ మేలే మాకు ముఖ్యం' అన్నారు వాళ్లు.

వైదేహి సంతోషించింది.

'నువ్వే మా ప్రాణం!'

వైదేహి నవ్వింది.

'మీ అత్త మామల ఆశలకు నువ్వే దిక్కు. నువ్వే భవితవ్యం. నువ్వే సౌభాగ్యం. సర్వస్వం'

వాళ్ల ఓదార్పు ఏమీ మిగల్లేదు.

వెర్రిగా ఏడ్వసాగింది.

'అమ్మలాంటి అత్త చెప్పినట్లు నడుచుకో అన్నారు జానకీ రామయ్యలు వెళ్లిపోయారు.

అన్నలూ, తమ్ములూ వచ్చారు. ఆదరంగా మాట్లాడారు. ఎంతో సంతోషం.

'మీ అత్త మాట విను!'

మళ్లీ భయం.

ఆడబిడ్డలు వచ్చారు. సానుభూతి చూపారు. అదే సలహా... అదే దుఃఖం

అత్త వస్తుందేమోనని భయం.

ఎవరేం చెప్పినా తాను వినాలి. తన మాట ఎవరూ వినరు.

తాను చదువుకొంది. లెక్చరర్‌గా కొంతకాలం పనిచేసింది. పెళ్లయిన వెంటనే ఉద్యోగం వదులుకుంది. తాను ఆలోచించగలదు. తనకు కొన్ని అభిప్రాయాలు వున్నాయి. కొన్ని ఆశలు. కొన్ని ఊహలు. ఇవేవీ ఎవరికీ అక్కర్లేదు.

వైదేహి గొప్ప మేధావి. గొప్ప సోషియాలజీ లెక్చరర్ అని అందరూ పొగుడుతుంటే తానెంతో గర్వపడేది. అంతా ఏమయింది?

ఇప్పుడు అబార్షన్!

రేపు! ఆడపిల్లయితే అబార్షనే!

అసలు మగ కడుపే రాకపోతే!

ఒట్టి గొడ్డును ఎవరూ మేపరు. అత్త ఊరుకోదు. సవతుల్ని తెస్తుంది. శ్రీరాం తల్లి మాట జవదాటడు.

తనేమవుతుంది?

తన అందం? తన తెలివితేటలు? తన ఆశలు? తన ఆకాంక్షలు? తన ఆలోచనలు?

ఆడపిల్లలకు ఇవేవీ వుండరాదు. వెర్రి గొడ్డులా తల వూపడం తెలియాలి.

రాత్రి శ్రీరాం చాలా కబుర్లు చెప్పాడు. సంతోషపరచడానికి ప్రయత్నించాడు. అనాసక్తంగా వింది. ఇదంతా చెప్పేది అమ్మ మాటను అంగీకరించమనడానికే.

తాను ఆడపిల్లను కనరాదు. ఆడపిల్ల కడుపున పడితే... వేరే మార్గం లేదు... కడుపు కోత తప్పదు.

అసలు మగపిల్లలే కలక్కపోతే తాను తల్లికారాదా? ఆడపిల్లను కనకూడదా? పెంచకూడదా?

**'అందరూ ఆడపిల్లలే పుట్టే వంశంలో ఒకే ఒక్కడు శ్రీరాం వంశోద్ధారకుడు పుట్టాడు. అందరూ మగపిల్లలే పుట్టే వంశంలో వైదేహి ఒక్కతే అదృష్టవంతురాలు పుట్టింది. వాళ్లకు పెళ్లయితే అందరూ మగపిల్లలే పుడతారని ఆశపడ్డాను. ఇలా అవుతుందని అనుకోలేదు'. వనజ నిట్టూర్చింది. నిరాశపడింది. నిశ్చయానికి వచ్చింది. నిర్ణయం చెప్పింది.**

బొట్టు కాటుక పెట్టటం, గజ్జెలు, గాజులు తొడగడం, జడ వేయడం, పూలు పెట్టడం, చిట్టిచేతులు, చిన్ని నడకలు, బుజ్జి మాటలు, పాటలు, ఆటలు తనకు అదృష్టం లేదా! తాను అమ్మ అని పిలిపించుకోదా?

పాలివ్వడం, పక్కలో వేసుకోవడం, ముద్దులు పెట్టడం, పెట్టించుకోవడం, జో కొట్టడం, నిద్ర పుచ్చడం, లేపడం, స్నానాలు చేయించడం, చేయి పట్టి నడిపించడం, నడవడం, నవ్వడం, ఆటలు ఆడడం, పాటలు పాడడం ఇవేవీ తనకుండవా? తల్లి కాబోయే తాను ఎందుకు తల్లి కాకూండా పోవాలి?

ఆడపిల్లను పుట్టనివ్వరు. పుడితే అత్త కోపం, మామ నిర్లక్ష్యం, భర్త తృణీకారం, తల్లిదండ్రుల అశాంతి, తనకు అనాదరణ తప్పదా?

గర్భవిచ్ఛిత్తికి తాను అంగీకరించాలా? ఎన్ని కడుపులు తీయించుకోవాలి? ఎంత అనారోగ్యం మూట గట్టుకోవాలి? ఎంత చావు కొని తెచ్చుకొంటుంది?

తానెవరి కోసం బతుకుతున్నట్లు?

అమ్మానాన్నలు? అత్తమామలు? బంధువర్గం? భర్త? తన కోసమా? తన బిడ్డ కోసమా?

ఆడపిల్ల అంతిమ లక్ష్యం తన కోసం తాను బతకడమా? తన సంతానం కోసం తాను జీవించడమా? వైదేహి తల గిర్రున తిరిగిపోతూ వుంది.

తన అస్తిత్వానికి అర్థం... పరమార్థం లేదా?

భర్త నిద్రపోయి చాలా సేపయింది. వైదేహి కన్నీరు మున్నీరుగా ఏడుస్తూనే వుంది.

'వైదేహి! అంతా సవ్యంగా జరుగుతుంది. భయపడకు! పడుకో!'

ఓదార్పా! కలవరింతా?

భర్త కదిలాడు. భర్త నిద్ర చెడకూడదు.

లైటు ఆఫ్ చేసింది. చీకటి! ఏదో నీడలు..... పరకాయించి చూస్తే... అంతా శూన్యం...

వైదేహి తల నిండా వెలుతురు... నీడలు.... కుక్కల అరుపులు..... నక్కల ఊళలు..... గుర్రాల స్వారీ....పులుల పంజాలు.... సింహాల కోరలు....శవాల గుట్టలు...


ప్రకృతిలో విపరీతంగా మార్పు. ఊహించలేని మార్పు! ఎక్కడ చూసినా మగవాళ్లు! పులులు! సింహాలు!తోడేళ్లు!

ఆడపిల్లల పెళ్లి భారం కాదు. కట్న కానుకలు ఇవ్వనక్కర్లేదు.

ఆడపిల్ల కావాలి! మగపిల్లలే కట్నకానుకలు ఇచ్చి ఆడపిల్లల్ని కొనుక్కొని పోతున్నారు. భద్రంగా దాచుకొంటున్నారు. ఇళ్లల్లో... కోటల్లో...భూగర్భంలో!

ఆడపిల్లలు పొడవుగా, ఎత్తుగా, లావుగా, బలిష్టంగా పుష్టిగా ఉండాలి.

బలంగా వున్న ఆడపిల్లలకే గిరాకీ! ఎక్కువ డబ్బు! ఎక్కువ కట్నం! ఎక్కువ రేటు!




ఒక్క యువతి. అయిదుగురు భర్తలు! పదిమంది భర్తలు...

నీడలు...క్రూరమృగాలు....అడవి జంతువులు... పశువులు.... స్త్రీల కొరత...

స్త్రీ అయితే చాలు. అమ్మ, అక్క, అవ్వ, వావి వరుసలు లేవు. వయస్సు యోగ్యతలు లేవు. స్త్రీ అయితే చాలు... చిన్నదా? పెద్దదా? ముసలిదా? ముతకదా? ఏం పనిలేదు?

ఆడ సంతానం లేదు. స్త్రీలు ఛస్తున్నారు. వయస్సు ముదరకముందే చావు రాకముందే! స్త్రీ అయినందుకే! వందలు.... వేలు...మొగుళ్లు, మొగోళ్లు!

ఆడవాళ్ల కోసం మగవాళ్లు కొట్టుకొంటున్నారు. చంపుకొంటున్నారు... ఛస్తున్నారు... చంపుతున్నారు... విషవలయం!

ఆడవాళ్లున్న చోటుకు రాష్ట్రానికి, దేశానికి యాత్రలు, యుద్ధాలు...సంగ్రామాలు...చావులు...

స్త్రీల కోసం మనుషులున్నచోట...మగవాళ్లున్న చోట రక్తపాతం... స్వదేశాలలో, విదేశాలలో నాగరికత శూన్యం... సంస్కృతి శూన్యం....కళలు శూన్యం... భూకంపం... ఆకాశ పతనం...సముద్ర మథనం... తుఫానులు!వరదలు...కల్లోలాలు...చావులు...

రాకెట్ల యుద్ధాలుకాదు.... విషవాయు ప్రయోగాలు కాదు.... అంతరిక్ష యుద్ధాలు కాదు....అణుబాంబు ప్రయోగాలు కాదు...బాంబులతో కాదు...తుపాకులతో కాదు...విల్లంబులతో కాదు... కత్తులు, కటార్లు, ఈటెలు, గండ్రగొడ్డళ్లు,కొడవళ్లు కాదు...బండలు, రాళ్లు రప్పలు కాదు...

చేతులే ఆయుధాలు. ముష్టియుద్ధాలు, హతుడు స్త్రీని వదిలేస్తాడు. బతికి ఉన్నవాడు ఆమెను ఎత్తుకుపోతాడు. వందల మంది వెంటబడతారు. చంపుకొంటారు. ఛస్తారు. ఆమెను చంపుతారు.

స్త్రీలు లేనప్పుడు పశువులు ప్రత్యామ్నాయం అవుతాయి. లొంగిన పశువు చనిపోతుంది. లొంగని పశువు చంపుతుంది.

మనిషి విజయుడు. పశువులు అంతరించిపోతాయి.

బలవంతులైన మగవాళ్లు బలహీనులైన మగవాళ్లను ఆడవాళ్లను చేసి వాడుకొంటారు.

పశువులు అంతరించాయి. మనుషులు చనిపోయారు.

భూమి నిర్విరామంగా తిరుగుతూ వుంది. విశాల శూన్యం నిలిచింది.

అడవులు దగ్ధమయ్యాయి.

జలం భూప్రళయం సృష్టించింది.

అడవి మండుతూ వుంది, ఋతుచక్రం గతి తప్పింది.

ప్రాణ చలనం లేని భూమి విశాల శ్మశానంగా వుంది.

కడుపు పండని గొడ్రాలులాగా భూమి గింగిరాలు తిరుగుతూ వుంది.

బ్రహ్మ బ్రతిమాలి బామాలి తన బాధ్యతను స్త్రీకి అప్పగించాడు. మనిషి పరమేశ్వరుడై లయకారుడయ్యాడు. ఏమి పెంచిపోషించాలో దిక్కుతోచక విష్ణుమూర్తి కనిపించడం మానేశాడు.

మనిషి మీద తీవ్ర ఆగ్రహం కలిగి బ్రహ్మ సృష్టి కార్యం ఆపేశాడు.

బ్రహ్మ కన్నీటి చుక్కపడి ఏ ఏటి ఒడ్డునో... ఏ బురదలోనో... ఏ ఏకకణజీవో అమీబాలాగా కదలాడవచ్చు.

తన కడుపులోని ఏక కణజీవి ద్వికణ జీవిగా మారినట్లు ఉలిక్కిపడి లేచి చుట్టూ చూచింది వైదేహి.

భర్త ఇంకా నిద్రపోతున్నాడు. ఆమె రెండు కళ్లు ఇద్దరు సూర్యుళ్లాగా మండిపోతున్నాయి.

వైదేహి పడకగదిలోకి అత్త ప్రవేశించింది. ఆమె అగ్గిలాగా లేదు. పులిలాగా లేదు. మేకలాగా లేదు. శూన్యంగా వుంది.

శ్రీరాం లేచి సిద్ధమయ్యాడు.

వైదేహి మంచం మీదే వుంది. లేవలేదు! సిద్ధం కాలేదు.

లే! సిద్ధమవు! వెళదాం! అత్త చెప్పింది. వైదేహి కదల్లేదు.

'లే!' రెక్కపట్టుకుంది.

'లేవను...లేపొద్దు!'

'నీకేమయింది?'

'ఏమీ కాలేదు!'

'పిచ్చా?'

'పిచ్చే!'

'ఎవరు నువ్వు?'

'బ్రహ్మను!'

'ఆ...!'

'బ్రహ్మ కాళ్లు గడ్డం పట్టుకొని బ్రతిమాలి తన పని అప్పగిస్తే అంగీకరించిన ఆడమనిషిని!'

శ్రీరాం వచ్చాడు

వైదేహి లేవలేదు

మామ వచ్చాడు

ఆమె కదల్లేదు

ఇంట్లోకి వచ్చిన వాళ్లందరూ వైదేహి గదిలోకి వచ్చారు.

'టైం అయింది వెళదాం కదలమన్నారు'

'నేను బతకాలి చావను'

'అబార్షన్ చాలా సులువు. నీకేమి కాదు సుఖంగా వుంటావు'

'వుండను! కడుపు తీసేస్తే నేను చచ్చిపోతాను'

'చావు!'

'నా కిష్టం లేదు!'

'నీకు తెలియడం లేదు!'

'మీకు తెలియడం లేదు. నా కడుపు తీస్తే మీరంతా చచ్చిపోతారు. ఒక్కరూ మిగలరు. ఏ ఆడమనిషీ వుండదు. ఆడవాళ్లంతా అంతరిస్తారు'

భర్త, భర్త తండ్రి, తల్లి, అక్కలు, బంధు మిత్రులు అందరూ వచ్చి మేమంతా లేమా! నీకేం భయం లేదు' అన్నారు.

'లేదు... నాకు భయముంది. నా కోసం కాదు భయం. మీ కోసం... నా పిల్లల కోసం... మీరందరూ ఛస్తారు... ఒక్కరూ వుండరు. నా గర్భ విచ్ఛిత్తి అయితే నేనే కాదు ఏ స్త్రీ మిగలదు. ఎవరూ బ్రతకరు... అందరూ ఛస్తారు. ఆడవాళ్లే కాదు... మగవాళ్లు పుట్టరు. పుట్టిన వాళ్లు బ్రతకరు. తన్నుకొంటారు.. చంపుకొంటారు... ఛస్తారు!'

'నీకు పిచ్చిపట్టింది'

'నాకు కాదు. మీకు మీకు పిచ్చి పట్టింది. ఆలోచనలేని పిచ్చి వాళ్లు మీరు. తెలివితేటల్లేని సన్నాసులు మీరు. మూర్ఖులు మీరు'

భర్త వచ్చి దగ్గర కూర్చున్నాడు.

'సృష్టి అర్థం కాని వ్యర్థులు మీరు. దేవుడిని ధ్వంసం చేసే అభాగ్యులు మీరు. సృష్టిని పరాభవించే నిర్భాగ్యులు మీరు. తల్లిదండ్రులుగా పనికి రాని అయోగ్యులు మీరు. బ్రతకటానికి అనర్హులు మీరు.'

తల్లిదండ్రులు వచ్చి దగ్గరకు చేరారు.

'నేను మిమ్మల్ని బ్రతికే అర్హుల్ని చేస్తాను. మిమ్మల్ని కాపాడతాను. బ్రహ్మను కాపాడతాను. దేవుడిని రక్షిస్తాను. సృష్టిని రక్షిస్తాను.'

'ఏమిటి నువ్వనేది?'

'నా గర్భ విచ్ఛిత్తి జరగరాదు, జరగనివ్వను. మీరు నా కడుపు తీయలేరు. తీయనీను.'

'అంటే'

'పిల్లని కంటాను'

★